# పంచముఖ హనుమాన్ విగ్రహానికి విరాళం అందజేత

- మాదారం గ్రామంలో పూజలు, కమిటీకి రూ.50 వేల సహాయం
- మెదక్ ఎంపీ కంటెస్టెంట్ నీలం మధు ముదిరాజ్

**జిన్నారం ఏప్రిల్ 03 సిరి న్యూస్:**



గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన 42 అడుగుల శ్రీ పంచముఖ హనుమాన్ విగ్రహాన్ని సందర్శించిన మెదక్ ఎంపీ కంటెస్టెంట్ నీలం మధు ముదిరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులకు రూ.50,000 విరాళాన్ని అందజేశారు. ఇంత భారీ, అద్భుతమైన విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎల్.మహేందర్ గౌడ్, కౌన్సిలర్ జలగిరి మల్లేష్ ముదిరాజ్, ఎరుకల నవీన్ కుమార్, జిన్నారం మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజు గౌడ్, ఠాగూర్ సీతారాం సింగ్, పెండల మల్లేష్ ముదిరాజ్, తోట్ల రామకృష్ణ ముదిరాజ్, తోట నరసింహులు ముదిరాజ్, అలాగే విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు ఎస్ విజయ్ గౌడ్, సుదర్శన్, సిహెచ్ గణేష్, చెరుకుల మల్లేష్, దాసరి సాయి, పెరుగు సీతారాం, లక్ష్మణ్, మనోజ్, మహేష్, వెంకటేశం గౌడ్, ఎరుకల రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్ల పుడుతుందన్న అనుమానం

- కుటుంబాన్నే చిదిమేసేలా చేసింది
- అబార్షన్ కు ఒప్పుకోలేదని భార్య పిల్లలను స్విమింగ్ పూల్ లోకి తోసి చంపేసిన కిరాతక భర్త
- హన్మకొండ జిల్లాలో వెలుగులోకి దారుణ ఘటన



**హన్మకొండ ,ఏప్రిల్ 3,(సిరి న్యూస్ ).**

మళ్లీ ఆడపిల్ల పుడుతుందనే అనుమానంతో భార్య ఇద్దరు కూతుళ్లను హతమార్చిన ఓ కిరాతకుని ఘాతుకం హన్మకొండ జిల్లాలో వెలుగులోకి వచ్చింది.ఆడపిల్లలన్న అనుమానంతో అప్పటికే భార్యకు రెండు సార్లు అబార్షన్ చేయించిన అతడు ,మరోసారి అబార్షన్ కు ఒప్పుకోకపోవడంతో భార్య పిల్లలను తాను నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ లోనే తోసి చంపేశాడు .వివరాల్లోకి వెళితే హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామ శివారులో అజారుద్దీన్ అనే వ్యక్తి స్విమ్మింగ్ పూల్ నిర్వహిస్తూ, భార్య ఫర్హాత్(26), కూతుళ్లు ఉమేరా (8), అయేషా(6)తో నివాసం ఉంటున్నాడు.ఇద్దరు ఆడపిల్లలు పుట్టిన అనంతరం, ఫర్హాత్ రెండు సార్లు గర్భం దాల్చగా, ఆడపిల్ల పుడుతుందనే అనుమానంతో అబార్షన్ చేయించిన అజారుద్దీన్నాలుగేళ్ల అనంతరం మళ్లీ గర్భవతి కాగా, ఆడపిల్ల పుడుతుందనే అనుమానంతో భార్యను అబార్షన్ చేయించుకోవాలని ఒత్తిడిచేసాడు .దానికి ఆమె అంగీకరించకపోవడంతో, భార్య పిల్లలను తమ స్విమ్మింగ్ పూల్ వద్దకు తీసుకెళ్లి, అందులో తోసేసి హత్యచేసి, ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్టు తెలిసింది.ఫర్హాత్ తండ్రి అజారుద్దీన్ పట్ల అనుమానం ఉందని తెలపడంతో, అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు నిర్ధారించారు.

# పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం

## 7 వ వార్డు కౌన్సిలర్ అనిత విష్ణువర్ధన్ రెడ్డి.



**సదాశివపేట. ఏప్రిల్ 3. (సిరి న్యూస్)**

సదాశివపేట పట్టణంలోని 7 వ వార్డులో సిద్ధాపూర్ లోని పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వార్డు కౌన్సిలర్ పాతదొడ్డి అనిత విష్ణువర్ధన్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసమే కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ అంబదాస్, వార్డు కాంగ్రెస్ ఇంచార్జి పాతదొడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు అంజిరెడ్డి, ప్రమోద్, నయీం, గణేష్, మున్నూరు శేఖర్, మాజీ సర్పంచ్ గొల్ల కృష్ణయ్య, సూరారెడ్డి, వార్డు ఆర్పీలు శోభ రాణి, వీరమని, అంగన్వాడి టీచర్స్ సువర్ణ, కార్యాలయ సిబ్బంది నర్సింలు, అఫ్జల్, నవీన్, వార్డు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# టీజీఎస్పీడీసీఎల్ 'విద్యుత్' వల!

- ఒకే కేటగిరీ.. రెండు రకాల బిల్లులు..
- కామన్ కనెక్షన్ పేరుతో సామాన్యుడి జేబుకు చిల్లు!
- రూ.1.60 ఉన్న యూనిట్ ధరను రూ.2.10కి పెంపు
- వినియోగదారులపై మోయలేని భారం
- ఆదాయమే పరమావధిగా కొత్త నిబంధనలు!
- ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ముక్కుపిండి వసూలు
- వివాదాస్పద నిర్ణయాలపై కొత్త సీఎండీ జోక్యం చేసుకోవాలని డిమాండ్




**హైదరాబాద్, సిరి న్యూస్ ,ప్రత్యేక ప్రతినిధి):**

ఒకవైపు సామాన్య ప్రజలపై విద్యుత్ భారం మోపబోమని ప్రభుత్వం ప్రకటిస్తుంటే, మరోవైపు టీజీఎస్పీడీసీఎల్ యాజమాన్యం పరోక్ష మార్గాల్లో వసూళ్ల పర్వానికి తెరలేపింది. ఆదాయ వనరుల సమీకరణే లక్ష్యంగా వినియోగదారులకు అర్థం కాని రీతిలో కొత్త నిబంధనలు విధిస్తూ, నెలసరి బిల్లులను అమాంతం పెంచేస్తోంది. దక్షిణ మండల విద్యుత్ సంస్థ తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలు ఇప్పుడు లక్షలాది మంది మధ్యతరగతి ప్రజలకు గుదిబండగా మారాయి.

### పొదుపు మంత్రానికి శాపంగా 'కామన్ సర్వీస్'

సాధారణంగా ఒక ఇంట్లో రెండు లేదా అంతకంటే ఎక్కువ పోర్షన్లు ఉన్నప్పుడు, యూనిట్ల వినియోగాన్ని నియంత్రించుకోవడానికి వినియోగదారులు వేర్వేరు సర్వీస్ కనెక్షన్లు తీసుకుంటారు. ఇది బిల్లు తగ్గించుకోవడానికి సామాన్యులు చేసే పొదుపు ఆలోచన. అయితే, ఈ ఆలోచననే ఇప్పుడు టీజీఎస్పీడీసీఎల్ తన ఆదాయ మార్గంగా మార్చుకుంది. గత నెలలో తీసుకున్న నిర్ణయం ప్రకారం.. ఒకే ఇంట్లో ఒకటి కంటే ఎక్కువ సర్వీసులు ఉంటే, అందులో ఒకదానిని తప్పనిసరిగా 'కామన్ సర్వీస్'గా మార్చాలని ఆదేశించారు.

### వినియోగదారుడికి అదనపు భారం

ఈ మార్పు వల్ల అప్పటి వరకు యూనిట్‌కు రూ.1.60 చెల్లించిన వినియోగదారుడు, ఇప్పుడు కొత్త టారిఫ్ ప్రకారం 50 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.2.10 చెల్లించాల్సి వస్తోంది. గ్రామీణ, పట్టణ తేడా లేకుండా అమలు చేస్తున్న ఈ నిబంధనతో సామాన్యులపై ఊహించని ఆర్థిక భారం పడుతోంది. విద్యుత్ నియంత్రణ మండలి భారం వేయమని చెబుతున్నా, యాజమాన్యం మాత్రం నిశ్శబ్దంగా కోట్ల రూపాయల అదనపు ఆదాయాన్ని పిండుకుంటోందని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కేటగిరీ-8 పేరుతో జంటనగరాల్లో దోపిడీ

ఇదిలా ఉండగా, జంటనగరాల్లో 'కేటగిరీ-8' వివాదం మరో ప్రధాన సమస్యగా మారింది. కొత్త విద్యుత్ కనెక్షన్ కావాలంటే అక్యూపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) ఉండాలనే నిబంధనను సాకుగా చూపుతూ సుమారు 4 లక్షల గృహాలకు కనెక్షన్లు నిలిపివేశారు. కోర్టు ఆర్డర్ల పేరు చెప్పి గత సీఎండీ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పటికీ పరిష్కారం కాకపోగా, కనెక్షన్ కావాలనుకునే వారికి కేటగిరీ-8 కింద ఇస్తామని మెలిక పెడుతున్నారు. ఈ కేటగిరీలో విద్యుత్ వినియోగిస్తే యూనిట్‌కు ఏకంగా రూ.12 వసూలు చేస్తున్నారు. ఇది సామాన్య ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ముక్కుపిండి వసూలు చేయడమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కొత్త సీఎండీపైనే ఆశలు..

ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో, కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఎండీ ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై తక్షణమే సమీక్ష నిర్వహించాలని బాధితులు కోరుతున్నారు. అటు కామన్ సర్వీస్ టారిఫ్, ఇటు కేటగిరీ-8 నిబంధనలను సవరించి మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించేలా నిర్ణయాలు తీసుకోవాలని భాగ్యనగర వాసులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో టీజీఎస్పీడీసీఎల్ కేవలం లాభాపేక్షతో నడిచే వ్యాపార సంస్థగా మిగిలిపోతుందనడంలో సందేహం లేదు.

# వడ్డేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- లంచం ఇవ్వలేదని ..డాక్యూమెంట్స్ ఇవ్వకుండా సతాయింపు ..
- విసిగి వేసారి పిర్యాదు చేసిన బాధితులు
- వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు !!

**హైదరాబాద్ ,ఏప్రిల్3,(సిరి న్యూస్)**

హనుమకొండ జిల్లాలోని వడ్డేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. అక్రమ రిజిస్ట్రేషన్లు మరియు లంచాల వసూళ్లపై వచ్చిన సమాచారంతో అధికారులు కార్యాలయానికి వచ్చారు . తలుపులు మూసివేసి సిబ్బంది ఎవరూ బయటకు వెళ్లకుండా తనిఖీలు చేపట్టారు.సబ్ రిజిస్ట్రార్-1, సబ్ రిజిస్ట్రార్-2 చాంబర్లలోని రికార్డులు, రిజిస్ట్రేషన్ ఫైళ్లు, నగదు లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సోదాల సమయంలో సుమారు 20 మంది డాక్యుమెంట్ రైటర్లు 70 డాక్యుమెంట్లతో కార్యాలయం వద్ద లైన్‌లో ఉన్నట్లు సమాచారం.గత నాలుగు నెలలుగా రిజిస్ట్రేషన్ పూర్తి అయిన సుమారు 200 డాక్యుమెంట్లను డబ్బులు ఇవ్వలేదని కారణంగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్ అధికారులు ఇవ్వకుండా వేధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేరుగా రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన కొనుగోలుదారులకు కూడా అనవసర ఇబ్బందులు కలిగించారనే ఫిర్యాదులు వెలువడ్డాయి.ప్రస్తుతం ఏజెంట్ల వద్ద నుంచి సుమారు రూ.45,500 నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కొంతమంది ఏజెంట్లకు సబ్ రిజిస్ట్రార్ సూచన మేరకు రూ.1,00,000 మరియు రూ.50,000 ఇవ్వాలని సందేశాలు పంపినట్లు కూడా అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాల ద్వారా సోదాలు కొనసాగుతున్నాయి. అక్రమ వసూళ్లు జరిగాయా?, నిబంధనలు ఉల్లంఘించి రిజిస్ట్రేషన్లు చేపట్టారా ?అనే కోణంలో అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విలీన గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి సంపూర్ణ కృషి






- నూతన డివిజన్ల ఏర్పాటు తథ్యం మౌలిక వసతులకు ప్రాధాన్యత

**అమీన్‌పూర్, ఏప్రిల్ 03, (సిరిన్యూస్)**

అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి, కిష్టారెడ్డిపేట, ఐలాపూర్, సుల్తాన్పూర్, దయార, పటేల్‌గూడ, ఐలాపూర్ తండా, జానకంపేట గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ ఈఈ సురేష్ తదితర అధికారులతో కలిసి విలీన గ్రామాలలో పర్యటించిన ఆయన, పెండింగ్ పనులు మరియు నూతన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కిష్టారెడ్డిపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం ఆలస్యంగా సాగుతున్నందుకు అధికారులు, కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు, రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని హెచ్చరించారు.వడకపల్లి గ్రామంలోని పురాతన కోట అభివృద్ధికి హెచ్ఎండిఏ నిధులు మంజూరయ్యాయని, రూ.9.80 కోట్ల రూపాయల వ్యయంతో కోట పరిసరాల్లో రాక్ పార్క్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు.సుల్తాన్పూర్ గ్రామంలో పురాతన ప్రాథమిక పాఠశాలను తొలగించి మోల్డ్ టెక్ పరిశ్రమ సహకారంతో రూ.1 కోటి వ్యయంతో నూతన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అలాగే నూతన ఫంక్షన్ హాల్, మల్లన్న దేవాలయాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.అమీన్‌పూర్, పటాన్ చెరు సర్కిళ్లలో జనాభాకు అనుగుణంగా మరో ఐదు డివిజన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. ప్రభుత్వం దీనిపై సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రభుత్వ నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులను వినియోగించి అభివృద్ధిని వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం దయార గ్రామంలో యూత్ బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానంద్, ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు సత్యనారాయణ రాజు కృష్ణ పాండు శ్రీకాంత్ మల్లేష్ భాస్కర్ గౌడ్ మల్లేష్ శ్రీకాంత్ రెడ్డి తదితర స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# శివానగర్‌లో భూ కబ్జాలు ప్రభుత్వ భూమి పై కన్ను అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

**జిన్నారం ఏప్రిల్ 03 సిరి న్యూస్**





శివానగర్ గ్రామంలో గ్రామ కంఠం భూమి యదేచ్ఛగా కబ్జాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. 12 వ వార్డులో సుమారు 1500 చదరపు గజాల ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించినట్లు వెల్లడించారు. ఈ భూమి విలువ సుమారు రూ.75 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. గ్రామానికి చెందిన ఈ భూమిపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. భూమికి సంబంధించి యాజమాన్య పత్రాలు లేని వ్యక్తులు ప్రహరీ,కంచెలు, ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చట్టాలపై సరైన అవగాహన లేకపోవడం వల్ల సమస్య మరింత క్లిష్టమవుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమాలకు అనుమతులు ఎలా మంజూరు చేశారనే విషయంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ప్రభుత్వ భూములను రక్షించేందుకు వెంటనే చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

